

అభివృద్ధే లక్ష్యంగా..
జిల్లా అభివృద్ధే తమ లక్ష్యంగా పనిచేస్తున్నామని కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ అన్నారు. - 8లో



భాగస్వాములు కావాలి
దేశ అభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి అన్నారు. - 10లో



పోలీసుల అదుపులో ..
శాలిగౌరారం మండలానికి చెందిన చిట్టీల వ్యాపారి సత్యనారాయణను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. - 10లో

న్యూస్‌రీల్

రైతాంగ రెండో దశ ఉద్యమాలకు సిద్ధం కావాలి

హుజూర్‌నగర్ : స్వాతంత్య్ర వేడుకల స్ఫూర్తితో రైతాంగ రెండో దశ ఉద్యమాలకు సిద్ధం కావాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా మంగళవారం హుజూర్‌నగర్‌లో జన జాగరణ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. సంస్కరణల పేరుతో విద్యుత్‌ను ప్రైవేటీకరించేందుకు సిద్ధమయ్యారని ఆరోపించారు. భవిష్యత్‌లో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జిల్లాలో నిర్మాణాత్మక పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో ఎం. వెంకటేశ్వర్లు, యల్లావుల రాములు, పాలకూరి బాబు, దేవరం మల్లేశ్వరి, జడ శ్రీనివాస్, జడ వెంకన్న, వై. రమేష్, గుండా రమేష్ మామిడి నరసయ్య, వెంకన్న, కృష్ణ పాల్గొన్నారు

రెండు రోజుల్లో కలెక్టరేట్ పనులు పూర్తి చేయాలి



ఫర్నిచర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రావు

సూర్యాపేట : కొత్త కలెక్టరేట్‌లోని పనులన్నింటినీ ఈ నెల 17వ తేదీనాటికి పూర్తి చేసి సుందరంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ వెంకట్రావు ఆదేశించారు. సూర్యాపేట పట్టణ పరిధిలోని కుడకుడ రోడ్డులో నిర్మిస్తున్న కలెక్టర్ కార్యాలయ సముదాయాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఇందులో అన్ని శాఖలకు కేటాయించిన ఫర్నిచర్‌ను, వీడియో కాన్ఫరెన్స్ హాళ్లలో ఏర్పాటుచేసిన ఎల్‌ఈడీ స్క్రీన్స్ పరిశీలించారు. సౌండ్ సిస్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. రెండు రోజుల్లో పనులు పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధంగా ఉంచాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్‌అండ్‌బీ ఈఈ యాకుబ్, జిల్లా హార్టికల్చర్ అధికారి శ్రీధర్, డీఈ పవన్ ఉన్నారు.

రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి

సూర్యాపేట: టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని జిల్లా పోలీస్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాంచందర్ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి శ్రీనివాస్ గౌడ్‌ను పోలీసులు అరెస్టు చేయడం లేదని, ఏ పోలీసు అయితే అరెస్టు చేయలేదో ఆ పోలీసులను డైరీలో రాసుకొని తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సంగతి చూస్తామనడం సరికాదన్నారు. పోలీసులను కించపరిచేలా అనుచిత వ్యాఖ్యలు చేసిన రేవంత్ రెడ్డి తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. చట్టం దృష్టిలో అందరూ సమానమేనని చట్టానికి లోబడి మాత్రమే పోలీస్ సిబ్బంది పని చేస్తారని తెలిపారు. సమావేశంలో సంఘంనాయకులు గునగంటి వెంకన్న, అంజన్ రెడ్డి, జోగు సైదులుగౌడ్, అభిషేక్ పాల్గొన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం



తాళిబొట్టు చూపిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం అర్చకులు వేదమంత్రాలతో వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా సుప్రభాతసేవ, నిత్యహోమం, మూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం చేశారు. శ్రీలక్ష్మీ నరసింహస్వామి, రాజ్యలక్ష్మి చెంచులక్ష్మి అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర,కుంకుమార్చనలు గావించారు. నూతన పట్టు వస్త్రాలతో స్వామిఅమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్లమహోత్సవ సంవాదం చేపట్టారు. అనంతరం విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం , పంచగవ్యప్రాశన, రుత్విగ్వరణం, మధుపర్క పూజ ,మాంగల్య ధారణ, తలంబ్రాలతో కల్యాణతంతు ముగించారు. ఆలయ ప్రాంగణంలోని క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి తమలపాకులపూజ, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు, దుర్గాప్రసాద్‌శర్మ, సీతారామాచార్యులు, చీకూరి రాజేష్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో ముందంజ



> అమరుల త్యాగంతోనే నేడు మనం స్వాతంత్య్ర ఫలాలు అనుభవిస్తున్నాం. యావత్ జాతి అమరులకు రుణపడి ఉంది. కొట్లాడి సాధించుకున్న రాష్ట్రంలో కేసీఆర్ నేతృత్వంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతోంది. భారతదేశానికి తెలంగాణ రోల్ మోడల్‌గా మారింది.
> – విద్యుత్‌శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి



సూర్యాపేట పట్టణంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం సెల్యూట్ చేస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి, కలెక్టర్ వెంకట్రావు, ఎస్పీ రాజేంద్రప్రసాద్

రూ.36,270 కోట్లతో జిల్లా అభివృద్ధి
- వ్యవసాయ రంగానికి పెద్దపీట
- విద్యుత్, విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు
- అమరుల త్యాగాలతో స్వాతంత్య్ర ఫలాలు అనుభవిస్తున్నాం
- స్వాతంత్య్ర దినోత్సవంలో మంత్రి జగదీష్‌రెడ్డి

సూర్యాపేట : జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాలకు రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే.. జిల్లాలో అభివృద్ధి విరబూసింది. స్వరాష్ట్రంలో భూములన్నీ సస్యశ్యామలం అయ్యాయి. తెలంగాణ ఆవిర్భావానికి పూర్వం జిల్లాలో 3,42,465 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పంటల సాగు 2023 నాటికి 6.18 లక్షల ఎకరాలకు విస్తరించింది. రాష్ట్ర ఏర్పాటుకు పూర్వం జిల్లాలో 4,16,500 మెట్రిక్ టన్నుల దిగుబడి ఉన్న ధాన్యం ఇప్పుడు ఏకంగా 12,02,200 మెట్రిక్ టన్నులకు పెరిగింది. కాళేశ్వరం తొలి ఫలితం అందుకున్న జిల్లా సూర్యాపేట. అందుకు ఈ జిల్లా ఎప్పటికీ సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటుంది.



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్..
భారతదేశంలో వ్యవసాయానికి 24 గంటలు ఉచితంగా నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ ప్రసిద్ధి కెక్కింది. ఒక్క సూర్యాపేట జిల్లాలోనే విద్యుత్ రంగానికి రూ.1,558.18 కోట్లు ఖర్చు పెట్టాం. సూర్యాపేట పట్టణ ప్రజలను మూసీ మురికి నీటి నుంచి విముక్తి కల్పించడంతో పాటు జిల్లాలో ఇంటింటికీ సురక్షితమైన మంచినీరు అందించేందుకు కేసీఆర్ ప్రవేశ పెట్టిన మిషన్ భగీరథ పథకంలో భాగంగా జిల్లాలో రూ.1277.16 కోట్లు ఖర్చు పెట్టాం. పట్టణాలతో సరి సమానంగా పల్లెల్లో ప్రగతి పరుగులు పెడుతోంది. జాతీయ స్థాయిలో పొందిన ఉత్తమ పట్టణ ,పంచాయతీ అవార్డుల్లో మొదటి 19వ వరుసలో తెలంగాణ ఉండడమే ఇందుకు అద్దం పడుతోంది. అందులో సూర్యాపేట మున్సిపాలిటీతో పాటు ఇదే నియోజకవర్గ పరిధిలోని ఏపూర్ ఉండడం గర్వకారణం. అందులో భాగంగానే పట్టణాభివృద్ధికి రూ.984.42 కోట్లు, గ్రామీణాభివృద్ధికి రూ. 882.02 కోట్లు వెచ్చించాం. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి రోడ్లు భవనాల శాఖ రూ.456.71 కోట్లు, పంచాయతీ రాజ్ శాఖ రూ. 707.42 కోట్లు ఖర్చు పెడుతోంది. బ్యాంక్ లింకేజీ, వడ్డీలేని రుణాలు ,స్త్రీ నిధి కలుపుకొని డీఆర్‌డీఏ ద్వారా 6,184 కోట్లు ఖర్చు పెడుతుండగా మైనార్టీ శాఖ ద్వారా రూ. 29.32 కోట్లు, మహిళా, శిశు సంక్షేమం, వికలాంగులు, వయో వద్ధుల సంక్షేమానికి రూ. 132.13 కోట్లు కేటాయింపులు జరిగాయి.

రైతు బంధుకు రూ.2,964కోట్లు
ఒక్క సూర్యాపేట జిల్లాలోనే చరిత్రలోనే ముందెన్నడూ లేని రీతిలో అటు అభివృద్ధితో పాటు ఇటు సంక్షేమ రంగానికి రూ. 36,270 కోట్లు ఖర్చు చేశాం. వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేయడమే కాకుండా వినూత్నమైన నిర్ణయాలతో అద్భుతమైన ఫలితాలు సాధించాం. వ్యవసాయంతో పాటు అనుబంధ శాఖలపై రూ. 7123 కోట్లు ఖర్చు పెట్టాం. అందులో రైతుబంధుకు రూ. 2,964కోట్లు, రుణమాఫీకి 1,032 కోట్లు, రైతుబీమాకు రూ.178.80 కోట్లు, నీటి పారుదల రంగానికి రూ.2,848.54 కోట్లు, పశుసంవర్ధక, మత్స్య శాఖలకు కలిపి రూ.273.05 కోట్లు ఖర్చు పెట్టాం. విద్యుత్ రంగంలోనూ విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చాం.

విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు
విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు సంభవించాయి. కంటి వెలుగు, కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ , కేసీఆర్ కిట్‌లను ప్రవేశ పెట్టడంతో పాటు ఆరోగ్యశ్రీకి రూ.214.30 కోట్లు కేటాయించాం. రూ. 235.62 కోట్లతో విద్యారంగాన్ని పటిష్ఠ పర్చడంతో పాటు 2014 కు ముందు కేవలం ఆరుకు పరిమితమైన గురుకులాలను ఏకంగా 19 కి పెంచాం. అప్ గ్రేడ్ అయిన వాటితో కలిపి 27 డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేసుకున్నాం. దళిత బంధుతో పాటు అంబేడ్కర్ భవనాల నిర్మాణాలు, కమ్యూనిటీ హాల్స్, స్టడీ సర్కిళ్లకు కలిపి మొత్తం రూ.572 కోట్లు వెచ్చించాం. వెనుకబడిన తరగతుల అభివృద్ధికి రూ. 417.53 కోట్లు, గిరిజనాభివృద్ధికి రూ.120.23 కోట్లు ఖర్చుపెట్టాం. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ గుజ్జ దీపికా యుగంధర్ రావు, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, కలెక్టర్ వెంకట్రావు, ఎస్పీ రాజేంద్రప్రసాద్, ఏఎస్పీ నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ , ఎస్పీ

చరిత్రలో నిలిచిపోయేలా సీఎం సభ



సూర్యాపేటలో సీఎం కేసీఆర్ సభా స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎంపీ, ఎమ్మెల్సీ

- ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయాలతో విపక్షాలకు షాక్
- సన్నాహక సమావేశంలో మంత్రి జగదీష్‌రెడ్డి

సూర్యాపేట: చరిత్రలో నిలిచిపోయేలా ఈనెల 20న సూర్యాపేటలో సీఎం కేసీఆర్ సభ నిర్వహించనున్నట్లు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సభను పురస్కరించుకొని మంగళవారం సాయంత్రం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ సన్నాహక సమావేశంలో పాల్గొన్న మంత్రి అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ సభాస్థలి ఏర్పాట్లను పరిశీలించారు.రైతు రుణమాఫీ, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, పోడు భూములకు పట్టాలు ఇవ్వడం, వీఆర్‌ఏలను క్రమబద్ధీకరించడంలాంటి నిర్ణయాలను ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకోవడంతో విపక్షాలు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాయన్నారు. ఆ షాక్ నుంచి ఇప్పుడిప్పుడే విపక్షాలు కోలుకునేలా లేవని వ్యాఖ్యానించారు. పరిపాలనా వికేంద్రీకరణలో భాగంగా జిల్లాగా మారిన సూర్యాపేటలో ఊహకందని రీతిలో అభివృద్ధి జరిగిందన్నారు. ఆ క్రమంలో నూతనంగా నిర్మించిన కలెక్టర్ కార్యాలయ భవన సముదాయం , ఎస్పీ కార్యాలయం, సమీకృత మార్కెట్ భవనంతో పాటు మెడికల్ కళాశాలను ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. 12 అసెంబ్లీ స్థానాల్లో గులాబీ జెండా ఎగురవేసి ఉమ్మడి నల్లగొండ జిల్లా కేసీఆర్ ఖిల్లాగా మారిందన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఈ 12 స్థానాల్లో ఎగిరేది గులాబీ జెండానే అని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికా యుగేందర్‌రావు, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, టెస్కాబ్ వైస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గాదరి కిషోర్‌కుమార్, బొల్లం మల్లయ్య యాదవ్, శానంపూడి సైదిరెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్‌రావు, చిరుమర్తి లింగయ్య,యాదాద్రి జిల్లా జెడ్పీ చైర్మన్ సందీప్ రెడ్డి పాల్గొన్నారు.

చట్టసభల్లో వామపక్షాల ప్రాతినిధ్యం అవసరం

- జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు వామపక్షాలు చట్టసభల్లో ఉండాల్సిన అవసరం ఉందని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. మిర్యాలగూడ మండలం రాయినిపాలెం గ్రామానికి చెందిన రాగిరెడ్డి వీరారెడ్డి 42వ వర్ధంతి సందర్భంగా సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం వీరారెడ్డి స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ ప్రస్తుత ఎన్నికల్లో డబ్బులు ఉన్నవారే పోటీ చేస్తున్నారని ప్రజల కోసం పనిచేసే నాయకులు కరువయ్యారని చెప్పారు. నిత్యం ప్రజల కోసం ఉద్యమించే కమ్యూనిస్టులు చట్టసభల్లో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. పేదలకు భూమి పంచాలని రాగిరెడ్డి వీరారెడ్డి వీరోచిత పోరాటం చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరాంనాయక్, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, ముదావత్ రవినాయక్, బావండ్ల పాండు, రాగిరెడ్డి మంగారెడ్డి, రెమడాల పరుశురాములు, వరలక్ష్మి, తిరుపతి రామ్మూర్తి, వినోద్‌నాయక్, అంజాద్, గాదె పద్మ, రామ్మూర్తి, పాదూరి గోవర్ధని, రొండి శ్రీనివాస్, అంకెపాక సైదులు, పాపానాయక్, ఊర్మిళ, సైదానాయక్, నాగేంద్రప్రసాద్, గోవింద్, పఠాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న జూలకంటి రంగారెడ్డి

శ్రీకాంతాచారికి నివాళి

భానుపురి (సూర్యాపేట) : విశ్వకర్మ ముద్దుబిడ్డ, మలిదశ తెలంగాణ అమరవీరుడు కాసోజు శ్రీకాంతాచారి జయంతి వేడుకలను విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు పోతుగంటి వీరాచారి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్ హాజరై శ్రీకాంతాచారి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. శ్రీకాంతా చారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు కూరెళ్ల మనోహర్ చారి, జనగామ వీరాచారి, బైరోజు లింగాచారి, శ్యాంసుందర్ చారి, మామిళ్లపల్లి భారత చారి, పర్వతం రాము, కంచర్ల లింగాచారి, శంకరాచారి, నరసింహాచారి పాల్గొన్నారు.



సూర్యాపేటలో శ్రీకాంతాచారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

- నేడు కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ రాక
- భువనగిరిలో పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశం
- బల ప్రదర్శనకు సిద్ధమైన నాయకులు

సాక్షి, యాదాద్రి: భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం బుధవారం భువనగిరిలో జరగనుంది. పార్లమెంట్ నియోజకవర్గ కోఆర్డినేటర్, కర్ణాటకలోని హంగల్ ఎమ్మెల్యే శ్రీనివాస్ మానే, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మరికొందరు ముఖ్యనాయకులు ఈ సమావేశానికి హాజరుకానున్నారు. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని భువనగిరి, ఆలేరు, తుంగతుర్తి, నకిరేకల్, మునుగోడు, ఇబ్రహీంపట్నం, జనగామ అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి కాంగ్రెస్‌కు చెందిన అన్ని విభాగాల నాయకులు సమావేశంలో పాల్గొంటారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేసిన వారితోపాటు రానున్న ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఆశావహులు, పీసీసీ ప్రతినిధులు, పార్టీ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులను ఈ సమావేశానికి ఆహ్వానిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో పోటీచేయాలనుకునే వారి నుంచి పార్టీ కోఆర్డినేటర్ దరఖాస్తులు తీసుకోనున్నారు. దీంతో నాయకులు బలపదర్శనకు సిద్ధమయ్యారు. ఎంత మంది పోటీ చేయడానికి ముందుకు వచ్చినా దరఖాస్తులను తీసుకోనున్నారు. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించి రానున్న ఎన్నికల్లో ఎవరు పోటీ చేస్తే విజయావకాశాలు ఉంటాయని తెలుసుకుంటారు. ఉదయం 11 గంటలకు భువనగిరిలోని సాయి కన్వెన్షన్‌లో సమావేశం జరుగుతుందని డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో మంగళవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. ఆంజనేయస్వామికి ఆచార్యులు ఆకుపూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారిని సింధూరంతో అభిషేకించి, తమలపాకులతో అర్చించారు. అంజనీపుత్రుడికి నైవేద్యాన్ని సమర్పించారు. ప్రధానాలయంలో సుప్రభాతం, అభిషేకం, అర్చన, శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం , బ్రహ్మోత్సవం, జోడు సేవలు విశేషంగా చేపట్టారు. సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు.

నేటి నుంచి 'రుణమాఫీ' జమ

- డీసీసీబీ పరిధిలో రూ.లక్షలోపు రుణాలకు రూ.104 కోట్ల 7లక్షలు విడుదల
- ఇప్పటికే రూ.25 వేలలోపు రుణాలు రూ.14.87 కోట్లు మాఫీ
- 31 బ్రాంచీల్లో 36,205 మంది రైతులకు ప్రయోజనం



నల్లగొండ అగ్రికల్చర్ : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు లక్షలోపు పంట రుణాలను మాఫీ కోసం నిధులను విడుదల చేసింది. 2018 డిసెంబర్ 11వ తేదీలోపు తీసుకున్న పంట రుణంలో రూ.లక్షలోపు మాఫీ చేస్తోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలోని 31 బ్రాంచీల్లో పంట రుణాలను తీసుకున్న 36,205 మంది రైతులకు రుణమాఫీ వర్తించింది. రూ.99,999 వరకు పంట రుణాలు ఉన్న రైతులందరికీ ఖాతాల్లో బుధవారం నుంచి రుణమాఫీ డబ్బులను జమ చేయనున్నారు.

మూడేళ్ల క్రితమే రూ.25 వేలలోపు మాఫీ..
రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్ల క్రితం రూ.25 వేలలోపు పంట రుణాలను మాఫీ చేసింది. అప్పట్లో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలోని 31 బ్రాంచీల్లో 13,666 మంది రైతులకు సంబంధించిన రూ.14.87 కోట్లు మాఫీ అయ్యాయి. కానీ గత రెండేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ విషయంలో ఎటూ తేల్చకపోవడంతో రైతులు కొంత ఆందోళనకు గురయ్యారు. ప్రభుత్వం మాఫీ చేస్తుందన్న ధీమాలో అనేక మంది రైతులు పంట రుణాలను చెల్లించలేదు. చాలామంది కనీసం రెన్యూవల్ కూడా చేసుకోలేదు. దీంతో రైతులపై వడ్డీ భారం పడింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రూ.లక్షలోపు పంట రుణాలను మాఫీ చేస్తున్నట్లు ప్రకటించి రూ.104 కోట్ల 7లక్షలు జిల్లా కేంద్ర సహకార బ్యాంకుకు విడుదల చేసింది. దీంతో సహకార సంఘాల ద్వారా పంట రుణాలను తీసుకున్న రైతులకు ఊరట లభించింది. నల్లగొండ జిల్లాలోని 14 బ్రాంచీలు, సూర్యాపేట జిల్లాలో 9, యాదాద్రిభువనగిరి జిల్లా పరిధిలోని 8 బ్రాంచీల పరిధిలో కలిపి మొత్తం 31 బ్రాంచీల్లో 22,539 మంది రైతులకు లబ్ధి చేకూరనుంది.

రెండు దఫాల్లో 36,205 మందికి..
మొదటి దఫా, రెండో దఫాలలో కలిపి సహకార సంఘాల ద్వారా రుణాలు పొందిన 36,205 మంది రైతులకు సంబంధించిన పంటరుణాలు రూ.118 కోట్ల 94లక్షలు రాష్ట్ర ప్రభుత్వం మాఫీ చేసింది. నెలాఖరులోగా మాఫీ సొమ్ము రైతుల ఖాతాల్లో జమ చేయడానికి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధికారులు చర్యలు చేపట్టారు. 2018 డిసెంబర్ 11లోపు పంటరుణాలను తీసుకుని తిరిగి చెల్లించిన రైతు ఖాతాల్లో కూడా రుణమాఫీ డబ్బులను జమచేయనున్నారు. ఆ రైతులు తిరిగి ఖాతాల నుంచి డబ్బులు తీసుకోవచ్చు.

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు



ఎన్నికల హామీ మేరకు పంట రుణాలను మాఫీ చేసినందుకు సీఎం కేసీఆర్, మంత్రులు జగదీష్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డికి ధన్యవాదాలు. డీసీసీబీ పరిధిలో 36,205 మంది రైతులకు రూ.118 కోట్ల 94లక్షలు పంటరుణాలు మాఫీ అవుతున్నాయి. సొమ్ము బుధవారం నుంచి రైతుల ఖాతాల్లో జమ చేస్తాం.
– గొంగిడి మహేందర్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్

అంబరాన్నంటిన సంబురం

నల్లగొండలో


స్వాతంత్య్ర వేడుకలను పురస్కరించుకొని నల్లగొండలో స్వాతంత్య్ర సమరయోధులను సత్కరిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి


నల్లగొండలోని జెడ్పీహెచ్‌హెచ్‌ఎస్ విద్యార్థినుల జెండా ప్రదర్శన


గౌతమి మోడల్ స్కూల్ విద్యార్థుల ఆర్మీ జవాన్ల యుద్ధ ప్రదర్శన


వేడుకలకు హాజరైన అవార్డు గ్రహీతలు, అధికారులు తదితరులు

సూర్యాపేటలో


స్వాతంత్య్ర వేడుకలను పురస్కరించుకొని సూర్యాపేటలో స్వాతంత్య్ర సమరయోధులను సన్మానిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి


రైతుబంధు శకటం ప్రదర్శిస్తున్న సూర్యాపేట జిల్లా వ్యవసాయ శాఖ


సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు


స్వయం సహాయక సంఘాలకు చెక్కులు అందజేస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి

భువనగిరిలో


యాదాద్రి కలెక్టరేట్‌లో స్వాతంత్య్ర వేడుకల్లో పరేడ్ చేస్తున్న పోలీసులు


సాంస్కృతిక నృత్య ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు


జిల్లా మహిళా సమాఖ్య అభివృద్ధికి చెక్కు అందజేస్తున్న విప్ గొంగిడి సునీత, ఎమ్మెల్యే గాదరి కిశోర్, జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి


దివ్యాంగులకు సహాయ పరికరాలు పంపిణీ చేసిన విప్ గొంగిడి సునీత, చిత్రంలో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, డీసీపీ రాజేష్‌చంద్ర

ఉత్తమ సేవలకు గుర్తింపు


మంత్రి జగదీశ్‌రెడ్డి చేతులమీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న జిల్లా పరిషత్ సీఈఓ జి. సురేష్

విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన జిల్లాలోని ఆయా శాఖల అధికారులకు గుర్తింపు లభించింది. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సూర్యాపేటలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి పాల్గొని ఆయా శాఖల అధికారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.


డి. శారద, ప్రిన్సిపాల్, ప్రభుత్వ మెడికల్ కళాశాల, సూర్యాపేట | మురళీధర్‌రెడ్డి, సూపరిం టెండెంట్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, సూర్యాపేట | ఎస్.కిరణ్‌కుమార్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి | జ్యోతి పద్మ, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి | డి.రామారావు నాయక్, జిల్లా వ్యవసాయాధికారి | బి.శ్రీధర్‌గౌడ్, జిల్లా ఉద్యానవన శాఖాధికారి | గీత, ప్రొఫెసర్ ప్రభుత్వ మెడికల్ కళాశాల


సుదర్శన్‌రెడ్డి, ఏఓ కలెక్టరేట్ | రమేష్, డీపీఆర్‌ఓ | రాంపతినాయక్, డీఎం, సివిల్ సప్లై | డీఎస్వీ శర్మ, ఓఎస్‌డీ విద్యుత్‌శాఖ మంత్రి | శంకర్, జిలా గిరిజన అభివృద్ధిశాఖ అధికారి | నాగేందర్, జిల్లా ల్యాండ్ రికార్డ్స్ అధికారి | మల్లికార్జున, ఫీల్డ్ మెన్, మత్స్యశాఖ


యాకూబ్, ఆర్‌అండ్‌బీ ఈఈ | వెంకటేశ్వర్లు, సీపీఓ | పి.రామానుజులరెడ్డి, మున్సిపల్ కమిషనర్, సూర్యాపేట | హేమ మాలిని, కలెక్టరేట్ సూపరింటెండెంట్ | వినయ్, సీసీ అడిషనల్ కలెక్టర్ | శ్రీను, సీసీ కలెక్టర్ | గోపి, కలెక్టర్ గన్‌మెన్ | రఘు, హెచ్‌హెచ్‌పీ కలెక్టరేట్ | రంగరావు, తహసీల్దార్, చివ్వెంల | శ్యామ్ గౌడ్ తహసీల్దార్, కోదాడ | శ్రీదేవి, తహసీల్దార్, పాలకీడు | పి.రవి, ఆర్‌ఐ | రాజశేఖర్, సీఐ సూర్యాపేట టౌన్ | రామలింగారెడ్డి, సీఐ హుజూర్‌నగర్ | సురేష్‌యాదవ్, ఎస్‌ఐ మేళ్లచెరువు | శ్రీరామ్, ఎస్‌ఐ సూర్యాపేట రూరల్


బాబు, హెడ్ కానిస్టేబుల్ సూర్యాపేట రూరల్ | దున్న శ్యామ్, సీనియర్ అసిస్టెంట్, సీపీఓ ఆఫీస్ | బి. సుధాకర్, జైలర్, సూర్యాపేట | శ్రీనివాస్, ఏఎస్‌ఐ, ఇంటలిజెన్స్ | సంతోష్ కుమార్, ట్రాఫిక్ కానిస్టేబుల్ సూర్యాపేట | రాజీవ్, టైపిస్ట్ డీపీఆర్‌ఓ కార్యాలయం | అనిల్, రికార్డ్ అసిస్టెంట్, డీపీఆర్‌ఓ కార్యాలయం | క్రిష్ణ సందీప్, ఏఓ, పెన్‌పహాడ్ | ప్రతాప్, ఏఎస్‌ఓ, విద్యాశాఖ | రాజేశ్వరి, జూనియర్ అసిస్టెంట్ సహకార శాఖ | పద్మ ప్రియ, హెడ్ నర్స్, నడిగూడెం | ప్రవీణ్‌కుమార్, ఫైర్‌మెన్ | ప్రసాద్, జూనియర్ లెక్చరర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, సూర్యాపేట | విజయలక్ష్మి, అంగన్ వాడీ టీచర్, చివ్వెంల | లక్ష్మీనారాయణ, జూనియర్ అకౌంటెంట్ ట్రెజరర్ | రమేష్ ఎస్‌ఐ, ఎక్సైజ్‌శాఖ


కోటేశ్వర్‌రావు, డీవైఎస్‌ఓ, ఎస్సీ అభివృద్ధి కార్యాలయం | మారతమ్మ, హాస్టల్ వార్డెన్, తుంగతుర్తి | ఫౌజియాబేగం, కుక్, బీసీ హాస్టల్, హుజూర్‌నగర్ | రవి, ఏపీఓ, పెన్‌పహాడ్ | కవిత, టీఏ, సూర్యాపేట | శ్రీనివాస్, సీఓ, డీఆర్‌డీఏ | రంగరాజు, ఏఈఈ పంచాయతీరాజ్, హుజూర్‌నగర్ | జ్ఞానేశ్వరి, ఆర్‌ఐ, సూర్యాపేట మున్సిపాలిటీ | శివశంకర్, డీపీఓ, సూర్యాపేట మున్సిపాలిటీ | ఎండీ రఫీ, జవాన్, సూర్యాపేట మున్సిపాలిటీ | సిహెచ్. రేణుక, జూనియర్ అసిస్టెంట్, సూర్యాపేట | గోపి, ఎంపీఓ, చివ్వెంల | మాధవరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ డీపీఓ కార్యాలయం | రజిని, ల్యాబ్ టెక్నీషియన్, జనరల్ ఆసుపత్రి సూర్యాపేట | సంధ్య, స్టాఫ్ నర్స్, సూర్యాపేట | శివకుమార్, సీనియర్ అసిస్టెంట్ గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రి

పురుగుల మందు తాగి రైతు మృతి

దేవరకొండ: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రైతు మృతిచెందాడు. డిండి మండలం రామాంతపూర్‌కు చెందిన నక్క అంజనేయులు(28) అత్తగారి గ్రామమైన దేవరకొండ మండలం పడ్మట్‌పల్లిలో వ్యవసాయం చేస్తూ కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. కొన్ని రోజులుగా అంజనేయులు మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి భార్య కుమార్తె ఉన్నారు. మృతుడి తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ నాగభూషణం తెలిపారు.

జిల్లా అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నాం

- కలెక్టర్ ఎస్. వెంకట్రావ్

దురాజ్‌పల్లి (సూర్యాపేట): జిల్లా అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకల్లో అదనపు కలెక్టర్లు సీహెచ్. ప్రియాంక, ఏ. వెంకట్‌రెడ్డితో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసు వందనం స్వీకరించి జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందించటడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పనిచేస్తుందన్నారు. స్వాతంత్య్ర సమరయోధుల గురించి యువతకు తెలియజేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు అందించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సురేష్, పీడీ కిరణ్‌కుమార్, సీపీఓ జి. వెంకటేశ్వర్లు, డీఏఓ రామారావు నాయక్, డీహెచ్‌ఓ శ్రీధర్‌గౌడ్, పీడీ ఐసీడీఎస్ జ్యోతి పద్మ, బీసీ వెల్ఫేర్ అధికారి అనసూర్య, ఎస్టీ సంక్షేమశాఖ అధికారి శంకర్, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్‌లో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకట్రావ్

బెల్ట్ దుకాణాలపై పోలీసుల దాడి

భువనగిరి : భువనగిరి మండలం వీరవెల్లి గ్రామంలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న బెల్ట్ దుకాణాలపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. అక్కడ విక్రయిస్తున్న రూ. వేలు విలువ చేసే వివిధ రకాల కంపెనీలకు చెందిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనుమతులు లేకుండా బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తున్న గ్రామానికి చెందిన చిన్నబత్తిని జోసెఫ్, బీమరి మధులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివనాగప్రసాద్ తెలిపారు.

భారతదేశ సంస్కృతి చాలా గొప్పది

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్


జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్

చివ్వెంల (సూర్యాపేట): భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాలు చాలా గొప్పవని సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రాజగోపాల్ అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవంలో భాగంగా మంగళవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సందర్భంగా గత వారం రోజులుగా నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. బార్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి పి. శ్రీవాణి, జూనియర్ సివిల్ జడ్జి కె. సురేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొండ్రాల అశోక్, ప్రధాన కార్యదర్శి పోలేబోయిన నర్సయ్యయాదవ్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

వివిధ శాఖల శకటాల ప్రదర్శన

సూర్యాపేట: పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకలకు విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి హాజరై పోలీసుల గౌరవ వందనం స్వీకరించి మాట్లాడారు. అనంతరం పరేడ్ గ్రౌండ్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, విద్యాశాఖ, మిషన్ భగీరథ, వవ్యసాయ శాఖ, ఉద్యానవన, ఫైర్, కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, పశుసంవర్ధకశాఖ, అటవీశాఖ, మత్స్యశాఖ, సంక్షేమ శాఖలు శకటాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో మంత్రి సతీమణి సునీత, జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, కమిషనర్ రామానుజులరెడ్డి, చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, వైస్ చైర్మన్ పుట్ట కిషోర్, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూర్యాపేట పట్టణంలోని ఎస్టీ బాలికల హాస్టల్ విద్యార్థులు, శ్రీచైతన్య, సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బీక్యాతండా ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. మంత్రి జగదీశ్‌రెడ్డి విద్యార్థులతో ఫొటోలు దిగారు. అనంతరం స్వాతంత్య్ర సమరయోధులను మంత్రి సన్మానించారు.

స్టాల్స్ ఏర్పాటు..

పరేడ్ గ్రౌండ్‌లో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. మంత్రి స్టాల్స్ అన్నింటిని తిలకరించారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

నార్కట్‌పల్లి: వ్యక్తి అదృశ్యమయ్యాడు. నార్కట్‌పల్లి మండలం బి.వెల్లంల గ్రామానికి చెందిన నాయీబ్రాహ్మణుడు చెన్నారపు అంజయ్య కులవృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 13న ఇంటి నుంచి వెళ్లిన అంజయ్య తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన వారి ఇళ్లతో పాటు బంధువుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదాబాబు తెలిపారు.